

# 23 కిలోలు

- తాడికొండ కె.శివకుమారశర్మ

కథల పోటీలో ద్వితీయ బహుమతిగా రూ.5,000 పొందిన కథ

ఆ ఆలోచన ఎప్పుడు వచ్చిందో నాకు బాగా గుర్తుంది.

"ఇవ్వాళ జుట్టుకు రంగు వెయ్యట్లేదేమిటి?" బాత్‌రూంలోకి వెళ్ళబోతుంటే శ్యామల అడిగింది.

"ఏం, దీని కేమయిందిప్పుడు?" అన్నాను జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ.

"కొన్ని వెంట్రుకలు రాగి రంగులోనూ, కొన్ని కుదుళ్ళ దగ్గర్నించీ తెల్లగా మెరుస్తూ, అక్కడక్కడా మాత్రం నల్ల వెంట్రుకలు."

"రేపెలాగూ ఇండియా వెడుతున్నాను గనుక నువ్వు నన్నో రెండు వారాలపాటు చూడక్కర్లేదు. ఇవ్వాళ, రేపట్లో నువ్వు నీ చూపులని నా మీద ప్రసరించే క్షణాలని వేళ్ళమీద లెక్కపెట్టచ్చు. ఆ పరిమిత క్షణాలని కూడా మాటీవీకో లేక జెమినీకో కట్టేస్తే నువ్వూ, నేనూ ఇద్దరం సుఖంగా వుండచ్చు."

"సాయంత్రం పార్టీ గురించి నేను మాట్లాడేది. మీ పక్కన నన్ను చూసే వాళ్ళ గూర్చి, మా నాన్నలాగా కనిపించే మొగుడి పక్కన ఎలా నడిచేది?"

"నాన్నే అనుకుంటే మాటైనా వినేదానివి."

"నాన్న అని నేను అనుకోవడంలా. మిగిలినవాళ్ళు అంటారంటున్నా. అయినా మీకంటే ఇరవయ్యేళ్ళు ఎక్కువ వున్న వాళ్ళు కూడా రంగేస్తుంటే- ప్రతీసారీ ఈ రాద్ధాంతం ఎందుకో?"

"ఊర్కేనే నిన్ను వుడికిద్దామని గానీ, చిన్నప్పుడు తలంటి పోసేటప్పుడు మా అమ్మచేత మొట్టికాయలు, ఇప్పుడు నీచేత చివాట్లు. అయినా, కూతురికి పెళ్ళికూడా చేసిన తర్వాత ఆ ఆర్భాటాలెందుకో?"

"కూతురికి పెళ్ళిచేసినా పెళ్ళాం ఇంకా వున్నది గనక."

"అదృష్టవశాత్తూ బట్టతల రాలేదు. లేకపోతే విగ్గుకూడా పెట్టించే దానివేమో?"

"విగ్గంటే గుర్తొచ్చింది. మా చెల్లెలు ఆయుర్వేదంలో ఇప్పుడు ఏవో షాంపూలూ, హెయిర్ ఆయిల్సూ వస్తున్నాయని చెప్పింది జుట్టుకోసం. మరిచిపోకుండా పట్రండి."

"అయితే రెండో సూట్‌కేస్ తప్పదన్నమాట ఈసారి కూడా."

"ఎయిర్‌లైన్ వాళ్ళు రెండు తీసుకువెళ్ళవచ్చంటే మీకేమిటి ప్రాబ్లం?"

"పెళ్లైన కొత్తలో అంటే అర్థముంది. పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడంటే అర్థముంది. దానికి పెళ్ళి చేస్తున్నప్పుడంటే అర్థముంది. ఇంకా ఇండియా వెళ్ళేటప్పుడూ, అక్కణ్ణించీ వచ్చేటప్పుడూ రెండెందుకుట?"

"మీ అబ్బాయికింకా పెళ్ళికావాలి. ఆ సంగతి గుర్తుందా?"

"వాణ్ణి ముందు ఆ అమ్మాయి చేసుకుంటాననాలి గదా!"

"చేసుకోనంటే నేను మహదానందంగా ఓ తెలుగమ్మాయిని చూసి పెళ్ళిచేస్తా."

"ఒకవేళ నువ్వు చెయ్యగలిగినా గానీ ఆ అమ్మాయితో ఇంగ్లీషులో తప్ప మాట్లాడలేవని పందెం కాస్తాను."

"అయినా ఫర్లేదు. మన దేశం కాని నాకీ అమ్మాయి నచ్చలేదు మొర్రో అంటే వాడేమో వినడు. మీరేమో పట్టించుకోరు."

"పట్టించుకోవడానికి ఇదేమన్నా తైలమా?"

"..."

"అర్థం కానట్టుంది. సరే. ఆ గోలెందుకు కానీ, ఈసారి నేను ఒక సూట్‌కేసుతోనే వెడతాను, ఒక దానితోనే తిరిగి వస్తాను."

"కుదరదు. రెండు పట్టుకు రావాల్సిందే."

"అక్కడ రెండిట్లో పట్టడానికి కావాల్సిన సరుకులేం వుండవు."

"పెట్టెలు పట్టనంతగా మీ అన్నయ్యావాళ్ళు మీకు పెట్టుబళ్ళేం పెట్టరని తెలుసు లెండి- పెళ్ళికొడుకు అమెరికా వాడైనా సరే."

"వాళ్ళు ఏమీ పెట్టకపోయినా సరే గానీ, రెండు పెట్టెల్లో పట్టే సరుకు ఏం వుంది?"

"ఏదో వుంది. మా చెల్లెలికి లిస్ట్ ఇచ్చాను. సూట్‌కేసులో పెడుతుంది. పట్టుకు వచ్చే బాధ్యత మాత్రం మీది."

"ఎయిర్‌లైన్స్ వాళ్ళు తెచ్చుకోనిస్తున్నారుకదా అని రాళ్ళతో నింపైనా రెండో సూట్‌కేసు పట్టుకు రమ్మంటావ్."

"అదే- డైమండ్ రాళ్ళతో."

"అట్లా పట్టుబడితే ఇంక శ్రీకృష్ణ జన్మస్థానమే. మర్చిపోయా. ఇది అమెరికా కదా, మొహమ్మద్ అని పేరు లేకపోవడం మంచిదయ్యింది. లేకపోతే ఆ క్యూబా పక్కన వున్న గొంటానమో ప్రిజన్లో పడేస్తారు."

"విగ్గంటే గుర్తొచ్చింది. మా చెల్లెలు ఆయుర్వేదంలో ఇప్పుడు ఏవో షాంపూలూ, హెయిర్ ఆయిల్సూ వస్తున్నాయని చెప్పింది జుట్టుకోసం. మరిచిపోకుండా పట్రండి."
"అయితే రెండో సూట్‌కేస్ తప్పదన్నమాట ఈసారి కూడా."
"ఎయిర్‌లైన్ వాళ్ళు రెండు తీసుకువెళ్ళవచ్చంటే మీకేమిటి ప్రాబ్లం?"

ఇంటి వైద్యం
★ తులసీ ఆకుల రసం లేదా చూర్ణం 3-5 గ్రాములు లేదా తులసీ క్వాథం (డికాక్షన్) 15-20 మి.లీ. ఉదయం- సాయంత్రం త్రాగిన ఏంక్సైటీనందు ఉపయుక్తంగా ఉంటుంది.

"అయ్యో, అంత భాగ్యం కూడానా?"

"మొగుణ్ణి జైల్లో పడేస్తారంటే దాన్ని భాగ్యమంటావ్! ఆహా, నామీద నీకెంత ప్రేమ వుందో ఇప్పుడర్థమయింది."

"నేనన్నది సూట్‌కేసుని డైమండ్లతో నింపగల సామర్థ్యం గూర్చి."

"డైమండ్లంటే ఏమిటి? రాళ్ళేగా! నీలాంటి వాళ్ళు వాటికి విలువనివ్వబట్టే అవి కాళ్ళకింద వుండకుండా ఆడవాళ్ళ వంటిమీద చేరెయ్, మగవాళ్ళ గుండెల్లో గుదిబండలై కూర్చున్నయ్."

"ఒకప్పుడు ముప్ఫై కిలోలు పట్టుకొచ్చాం ఒక్కో సూట్‌కేసులో. ఈ పెట్రోలు ధరల పుణ్యమా అని అది కాస్తా ఇరవై మూడుకు తగ్గించారని నేను బాధపడుతుంటే, అది పట్టుకురావడానికి కూడా ఎంత బాధో!"

ముప్ఫై కిలోలు- ఎందుకు గుర్తులేదూ? బాగానే గుర్తుంది. ఒక్కో సూట్‌కేసులో ముప్ఫై ఏం ఖర్మ ఇంకో రెండో, మూడో కూడా ఎక్కువై, పార్కింగ్‌లాట్లోంచి ఇంట్లోకి, పధ్నాలుగు మెట్లమీదుగా- ఎనిమిది సూట్‌కేసుల్ని పైకి చేరుస్తూ, అందులో ఎవరైనా ఇటుకలని ప్యాక్ చేశారా అని చిరాకు పడుతూ.

అదిగో, అప్పుడొచ్చింది ఆలోచన. రాళ్ళు, విలువైన రాళ్ళు.

అది గూడా, మా నాన్న గుర్తొచ్చి. ఆయన పాకులాడిన స్వర్గాదపీ గరీయసీ గుర్తొచ్చి. రక్తంలో కలిసిన పంచదార నవ్విన తియ్యటి నవ్వు, చిక్కని నల్లని రంగుతో కప్పివెయ్యబడుతున్న నెరిసిన జుట్టు ద్వారా బాత్‌రూం అద్దంలో ప్రతిఫలిస్తుండగా.

మా పిల్లలు పుట్టిన తరువాత ఒకసారి అమెరికా వచ్చారు. రిటైరయినా గానీ తరువాత మాత్రం ఇంక రానన్నారు. పరాయి మట్టిలో కలవడం గూర్చిన భయమే కాక, అంత్యక్రియలు తనకి కావలసిన విధంగా ఈ దేశంలో జరిగే అవకాశంలేదన్న నమ్మకమూ, ఈ ఖరీదయిన హాస్పిటల్ బిల్స్ నా మీద పడతయ్యేమోనన్న భయమూ కూడా కారణాలని నాకు తెలుసు.

అద్దంలోనుంచీ, "మరి, నీ సంగతేమిటి?"అని నాన్న అడుగుతున్నట్లనిపించింది.

* * *

నదులన్నీ సాగరంలో కలిసినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లోని వూళ్ళన్నీ హైదరాబాద్ వైపు పరుగెత్తుతున్నాయ్. అలలు కొండలకి కొట్టుకోవాలని చూపించే ఆతృత, బాధ్యతలేవీ లేకుండా అవి చేసే అల్లరీ కనిపిస్తుంది కానీ, సాగర మధ్యంలో వుండే గంభీరత మాత్రం ఆ వూళ్ళో ఎక్కడా కనిపించదు. సాగరపు లోతుల్లో దాగిన మణులే తామన్న సంగతి గుర్తించని ప్రజానీకం సాగరపు నివాసుల్లా ప్రవర్తిస్తుంటే అలసై ఆవిరయి పోవాలనిపిస్తుంది.

వంశీ పెళ్ళయిన తరువాత హైదరాబాద్‌లో ఆవిరయి గుంటూర్లో తేలా ననుకున్నాను గానీ, జేబులోని బస్ టికెట్ మాత్రం ఖచ్చితంగా కాదంది.

"అసలెందుకు వెళ్ళడం?" అన్నాడు అన్నయ్య.

ముప్ఫయ్యేళ్ళకి పైగా అయింది ఆ వూరు వదిలి. పాత యిల్లెక్కడో తెలుసు గనక వెతుక్కుంటూ వెళ్ళానని మాత్రం చెప్పలేను. బ్రాడీపేట నాలుగో లైన్లో నడుస్తూ వెడుతుంటే పైన వేలాడే ఎలక్ట్రిక్ వైర్లని చూసి, సాలెగూడులో నడుస్తున్న భావన.

"నువ్వనుకున్నట్టుగా గుంటూరు ఇప్పుడు లేదు. గుర్తు పట్టలేవు కూడాను," అన్నాడు సంజు.

"క్రితంసారి వెళ్ళినప్పుడు మనం వున్న ఇంటిని పడగొట్టి పోసిన కుప్ప చూసి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగెయ్" అన్నాడు వాడే మళ్ళీ.

మా అన్నదమ్ముల్లో వాడే కొద్దిగా ఎమోషనల్లూ, పొయెటిక్కూ గూడా.

ఆరు వాటాలు, మూడు బిల్డింగులూ వున్న కాంపౌండ్ అది. బిల్డింగుల మధ్యలోనే క్రికెట్టు ఆడడం- "ఒరేయ్! ఇక్కడ కాదు. బయటికి వెళ్ళి ఆడుకోండి" అన్న సుబ్బారావుగారి ఆజ్ఞని ఎప్పటికప్పుడే సిక్సర్ కొట్టేస్తూ.

ఇంటి పెరట్లో పత్తి చెట్టు. నాన్న ఎత్తుకుని తిప్పినప్పుడు ఏడుస్తున్నాను కదా అని ఎప్పుడైనా పత్తికాయలని కోసిస్తే కింద పడేసే వాణ్ణట. మళ్ళీ ఇంకొకదాన్ని కోసిస్తే దానికీ అదే గతి. ఆ వయసులో సదా గాడు విసిరికొట్టింది ప్లాస్టిక్ ఆట వస్తువుల్ని- ప్రకృతితో సంబంధం లేని వాటిని. డబ్బున్న తల్లిదండ్రులు వేరేగా అనుకుంటారు తప్ప ఆ వయసులో విసిరికొట్టడానికి ఏదైనా ఒకటేనన్న సీక్రెట్ మాత్రం పసిపిల్లల్లో మాత్రమే భద్రంగా దాగివుంటుంది.

"ఢిల్లీ సుల్తాన్, పట్టుకుపోతాన్" నాటకమూ అదే పెరట్లో. తవ్వడానికి గునపం కూడా లేక, అమ్మ యిచ్చిన అట్లకాడతో గుంట తవ్వి, అందులో ఎప్పణ్ణించో మూలగా పారేసిన బొంగుల్ని దూర్చి, వాటికి నాన్న పంచెని తెరగా కట్టి-

ఆ పెరట్లోనే పున్నాగ చెట్టు- అది కురిపిస్తే తప్ప చేతికి అందని వరాలూ; అందిన వరాల కాడలని విరిచి పీ పీ అని వూదడాలూ; పక్కనే వర్షం వచ్చినా రాకపోయినా వరాలని నేలమీదే ఏరుకోవాలని శాసించే పారిజాతం చెట్టు; అన్నీ ఎలా మరిచిపోగలను?

పూలచెట్లు ఇష్టమని బండెడు నల్లరేగడి మట్టిని అమ్మ తెప్పించి గోడ పక్కనే పోయిస్తే దాన్ని చదునుచేసి, ఇటికెలతో బోర్డరు చేసి అందులో విరగ పూయించిన కనకాంబరాలనీ, చేమంతులనీ, బంతులనీ, చిక్కుడు చెట్టునీ ఎట్లా మరువగలను? అదే మట్టితో వినాయకుణ్ణి చేసే ప్రయత్నాన్ని కూడా.

ఇంతకు ముందెప్పుడూ చూడని ఆ నాలుగంతస్తుల ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్సులోకి గేటుతీసి అడుగుపెట్టి ఆగిపోయాను. చుట్టూ చూశాను. ఆ చివరినించీ ఈ చివరిదాకా బండలు. నిరాశ ఆవహించింది.


"ఎవరు కావాలండీ?" కొత్త వాడినని పసిగట్టి అడిగాడు వాచ్‌మన్.

ఎవరని చెప్పను?

నా కోరిక విని ఆశ్చర్యపోయాడు ఆ ఎపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంటు. "కింద చూశారుగదా?" అని కూడా అన్నాడు- "కుదరదు" అనే ముందర.


(మిగతా 27వ పేజీలో)

## రచయిత పరిచయం



**తాడికొండ కె.శివకుమారశర్మ**

పుట్టింది; విద్యాభ్యాసం, గుంటూర్లో. ఐ.ఐ.టి మద్రాసులో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్. తర్వాత అమెరికాలో పి.హెచ్.డి . భార్య మల్లిక, పిల్లలు విరించి, మహతి. పదహారేళ్లకు పైగా వాషింగ్టన్, డి.సి. సబర్బ్సులో నివాసం . ఇప్పటిదాకా 15 పైగా కథలు పలు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. రచించిన నాటకాలు అజో-విభో కందాళం ఫౌండేషన్‌వారి వార్షికోత్సవాల్లోనూ, రవీంద్రభారతిలోను, తానా ఉత్సవాల్లోనూ ప్రదర్శించపబడ్డాయి. కథలు తెలుగునాడి (అమెరికా పత్రిక), స్వాతి సరసమైన కథల పోటీల్లోనూ ప్రథమ బహుమతులు అందుకున్నాయి. నటించడం, శాస్త్రీయ సంగీతం వినటం, రాయడం హాబీ.






ఇంటి వైద్యం

★ క్షీరబలా తైలంతో ధార చికిత్స ఆచరించిన ఉన్మాద లక్షణానికి ఉపయోక్తంగా ఉంటుంది.

(19వ పేజీ తరువాయి)

డబ్బుతో కొనలేనిది ఏముంది అన్న ధీమాతో వచ్చిన నన్ను ఈ పరిణామం నిరాశా నిస్పృహలకి లోనుచేసింది.

"ఒకసారి ఇలా రండి" అన్న వాళ్ళావిడ పిలుపు విని ఆయన వెళ్ళగానే చింతచిగురు గుర్తుకొచ్చి నోట్లో నీళ్ళూరించింది.

"మీ అదృష్టం బాగుంది. అయితే రెండ్రోజులాగాలి. ఉన్న బోర్‌వెల్‌లో నీళ్ళు రావట్లేదని ఇంకో బోర్‌వెల్ వేయిస్తున్నాం.

దానికోసం మెషీన్ వస్తుంది" అన్నాడాయన వెనక్కు వచ్చి.

రెండ్రోజుల తర్వాత అక్కడ నన్ను చూసిన వాళ్ళేమనుకున్నా లెక్క పెట్టలేదు. నా పనయిన తర్వాత నాగరికత చేతులు కడుక్కోమంటే నవ్వేసి జేబులో పెట్టుకున్న నా చేతుల్ని చూసి.

హైదరాబాద్ వచ్చిన తరువాత అన్నయ్య వాళ్ళకి అందులో ఏముందో చెప్పుకోనవసరం లేకపోయింది కానీ, ఎయిర్‌పోర్టులో నా పేరు ఎనౌన్స్ చేసి పిలిచిన తర్వాత- అది గూడా, లగేజ్ చెక్ చెయ్యడం అయిపోయిన తరువాత- వాళ్ళకి చెప్పక తప్పలేదు.

నమ్మలేనట్లు చూశారు. పెట్టి తెరిచి చూసిన తర్వాత ఆ చూపులు పిచ్చాణ్ణి చూసినట్లుగా మారెయ్.

"ప్రొహిబిటెడ్ ఐటంస్ లిస్టులో ఇది లేదు కదా?" అన్న నా ప్రశ్నకు జవాబివ్వలేక వెళ్ళమన్నారు.

న్యూయార్క్‌లో దిగిన తర్వాత కన్వేయర్ బెల్టుమీద నించీ తీసుకుంటుంటే సూట్ కేసుకు బొక్క పడ్డట్టు తెలిసింది. దాన్ని భద్రంగా తీసుకుని కస్టంస్ లైన్లో నిలబడ్డాను. మనిషిని చూడగానే హార్ట్ రేట్ చెప్పగలిగే ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ వాడొకడు నా సూట్‌కేస్ వాలకాన్ని చూసి దాన్ని ఎక్స్-రే మెషీన్లో పెట్టమన్నాడు.

ఆ మెషీన్లో దాని పేగులు లెక్కించిన ఆ కస్టంస్ అధికారి లేచి నిలబడి, అది ఇవతలకు రాగానే "ఇందులో ఏముంది?" అనడిగాడు చెప్పాను.

లావుగా వున్న కళ్ళద్దాల్లోంచి అతని కళ్ళల్లో నీటి పొర ఆకాశమంత విశాలంగా, సముద్రమంత నిశ్చలంగా కనిపించింది.

నాకన్నా అతను పెద్దకావచ్చు- ఈ చైనీసు వాళ్ళ వయసు చెప్పడం కష్టం.

"థాంక్యూ మై ఫ్రెండ్. యు గేవ్ మి ఎ గ్రేట్ అయిడియా", అని కరచాలనం చేశాడు. మా మధ్యలో కన్వేయర్ బెల్టు లేకపోతే కావలించుకునే వాడనిపించింది. యాక్సెంటుని బట్టీ నాలాగే ఇమ్మిగ్రెంట్ అని తెలిసింది.

ఇంటికి రాగానే ఆ సూట్‌కేస్ వాలకాన్ని అనుమానంగా చూసింది శ్యామల. అందులో ఏమున్నదని అడిగింది. చెప్పాను. నమ్మకపోతే పెట్టి తెరిచి చూపించాను.

"మరి నేను తెమ్మన్నవి?" కోపానికి ఆనకట్ట తెగడానికి సిద్ధంగా వున్నదని చెప్పగలను.

"ఆ రెండో సూట్‌కేసులో."

"మరి మీ గుడ్డలు?"

హైదరాబాద్ వచ్చిన తరువాత అన్నయ్య వాళ్ళకి అందులో ఏముందో చెప్పుకోనవసరం లేకపోయింది కానీ, ఎయిర్‌పోర్టులో నా పేరు ఎనౌన్స్ చేసి పిలిచిన తర్వాత- అది గూడా, లగేజ్ చెక్ చెయ్యడం అయిపోయిన తరువాత- వాళ్ళకి చెప్పక తప్పలేదు. నమ్మలేనట్లు చూశారు. పెట్టి తెరిచి చూసిన తర్వాత ఆ చూపులు పిచ్చాణ్ణి చూసినట్లుగా మారెయ్. "ప్రొహిబిటెడ్ ఐటంస్ లిస్టులో ఇది లేదు కదా?" అన్న నా ప్రశ్నకు జవాబివ్వలేక వెళ్ళమన్నారు.

"కేరీ ఆన్లో పట్టని వాటిని ఇండియాలో వదిలి వచ్చాను- బీదవాళ్ళకి ఇవ్వమని చెప్పి."

"ఎందుకని అన్ని డబ్బులు వేస్టు చేశారు?"

"వాటికన్నా విలువైన దానికోసం."

"ఎవరైనా వింటే నవ్వుతారు."

"చెప్పకు" అన్నాను పొరపాటున. అలా అనడం చెప్పడానికి పర్మిషన్ ఇచ్చినట్టే కదా!

"ఆ పెళ్ళికి వెళ్ళకుండా వుంటే మూడువేల డాలర్లూ మిగిలేవి, ఈ గోలా వుండేది కాదు."

"మూడు ఔన్సుల బంగారం వచ్చేది" అన్నారు పార్టీలో ఆడవాళ్ళు.

"ఇంకొన్ని వేలు కలిపితే ఇండియానించీ గ్రానైట్ తెప్పించి ఇంటి నిండా పరుచుకోవచ్చునన్నారు కొందరు మగవాళ్ళు."

"మీ డేడీ తెచ్చిన స్పెషల్ బేస్‌మెంటులో వుంది, చూడండి," అని చెప్పల్లా శ్యామల రాధీని, సదాని బేస్‌మెంట్‌లోకి తోసింది.

చీకట్లోనైనా, వానలోనైనా దాదాపు కళ్ళుమూసుకుని ఇంటికి డ్రైవ్ చెయ్యగలను- ఎన్నో ఏళ్ళబట్టి చేస్తున్నాను కాబట్టి.

ఆరోజు కూడా అలానే వస్తుంటే గుండ్రంగా తిరిగే ఎగ్జిట్ ర్యాంప్ మీద నా కారు మరింత గుండ్రంగా, అంతకన్నా వేగంగా, రోజూ టైర్లని పట్టి ఆపుతున్న రోడ్డు మీదున్న కసినంతా ఒక్కసారే తీర్చుకుంటూ, శృంఖలాలని తెంపుకుని అడవిలోకి పరుగెడుతున్న ఖైదీలా రోడ్డు మీద నించీ ఎగిరి దూకింది.

పోలీసులమీద కక్షతో ఎవడో, అక్కడికి దగ్గరలోనే వుండే పోలీస్‌స్టేషన్ వాళ్ళు తరచుగా వాడే ఆ ర్యాంప్ మీద నూనె పొయ్యడంవల్ల అక్కడ పోలీస్ కార్లకే కాక ఇంకా చాలా కార్లకి యాక్సిడెంట్ అయిందని చదివిన గుర్తు. అంటే బతికే ఉన్నాడా?

అయితే, అలాచేసిన వాణ్ణి పట్టుకున్నామని చెప్పారు గదా! మరి యిదెట్లా అయింది?

చుట్టూ ఎవరున్నారో చూద్దామని ప్రయత్నించాను. కానీ, లోతులో వుండడంవల్ల కాబోలు- ఆకాశం మాత్రం కనిపిస్తోంది. ఎవరి మొహాలూ కనిపించట్లేదు. శ్యామల వెక్కుపెట్టడం వినిపిస్తోంది.

నా కోరికని వాళ్ళు మన్నించరని భయపడ్డ మాట నిజమే. అందరూ చేసినట్లు చెయ్యాలనే పట్టుదల శ్యామలది. అందుకనే, నన్ను దహనం చెయ్యరనే నమ్మకం నాకు కలగలేదు. వీలునామా రాశాను గానీ. "దాన్ని అంతాఅయిపోయిన తర్వాత చూస్తే?" అన్న ప్రశ్న నన్ను వేధించిందిప్పటిదాకా. బేస్‌మెంటులో సదాతో చెప్పింది వాడికి గుర్తున్నదన్నమాట.


"బాబూ, మొదట నువ్వు మట్టి చల్లమ్మా."


ఎంతో ఆతృతతో ఎదురుచూశాను.

ఆకాశాన్ని కొంత కప్పేస్తూ సదా ముందుకు వచ్చాడు. వాడి చేతిలో నా ప్రియమైన సూట్‌కేస్. దాన్ని చూడగానే నా సందేహాలన్నీ పటాపంచలై పోయాయి. 'గాడ్ బ్లెస్ యూ' అన్నాను. వినిపించిందో, లేదో! అందులో వున్న మట్టిని నా మీద బోర్లించాడు.

నా తల్లి నన్ను కావలించుకుంటూ, నా వళ్ళంతా స్పృశిస్తూ, తన గర్భంలో నన్ను ఇముడ్చుకుంటూ ఆకాశాన్ని నాకు కనబడనీకుండా కప్పేసింది. ★

**రచయిత చిరునామా:**
ఫ్లాట్ నెం.101, నిర్మల్ విహార్,
గుప్తా గార్డెన్స్, రామంతాపూర్,
హైదరాబాద్- 500 013.






ఇంటి వైద్యం

★ శంఖపుష్పి, బ్రాహ్మి, మండూక పర్ణి, వచ, అశ్వగంధా, సర్పగంధా మొదలైన ఔషధాలు డిప్రెషన్‌యందు ఉపయుక్తంగా ఉంటుంది.